సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



కలగానే కన్వర్షన్!

అన్ని స్థాయిలో పదోన్నతులు కల్పించిన విద్యుత్ యాజమాన్యం..కింది స్థాయి ఉద్యోగులను విస్మరించిందని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో▸



తమ్ముడి వద్దే 'బంగారం'

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఎస్‌బీఐ లో 19 కిలోల బంగారం చోరీ కేసులో రికవరీ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/19^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం పొడిగా ఉంటుంది. రాత్రి పొగమంచు కురియడంతో చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సమయపాలన పాటించాలి

- డీఎంహెచ్‌ఓ మురళీధర్



కేసముద్రం: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ మురళీధర్ ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించి, స్టాఫ్ వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరాదీశారు. సిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈ మేరకు స్టాఫ్ నర్స్‌ను డిప్యూటేషన్‌పై ఇస్తామని తెలిపారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నందీకిషోర్, వైద్యులు విజయ్‌కుమార్, సురేష్, సీహెచ్‌ఓ సాజిద్ హుస్సేన్, ఎస్‌యూఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు సరికాదు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య



నెహ్రూసెంటర్: రాజ్యాంగం, ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల మనోభావాలు, పార్లమెంట్ ప్రతిష్టను అగౌరవపర్చడమంటే రాజ్యాంగ విలువలను అవమానించడమేనని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను హేళన చేయడం సరికాదన్నారు. దేశ ప్రజలను మరింత దరిద్రంలోకి దిగజార్చే ప్రయత్నంలో భాగమే జమిలి ఎన్నికలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల ఎజెండాను పక్కదారి పట్టించేందుకే పార్లమెంట్ సమావేశాల సమయం వృథా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కందునూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లతామర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు



గార్ల: మిర్చితోటలో నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మహబూబాబాద్ ఏడీఏ అజ్మీర శ్రీనివాస్ రైతులకు వివరించారు. శనివారం మండలంలోని ముల్కనూరు గ్రామంలోని ఓ రైతు మిర్చితోటలో ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. తోటల్లో నల్లతామర పురుగు నివారణకు జిగురు పూసిన పసుపు, తెలుపు, నీలిరంగు అట్టలను ఎకరాకు 20చొప్పున తోటలో అమర్చుకోవాలని సూచించారు. ఏఓ కావటి రామారావు, ఏఈఓ మేఘన పాల్గొన్నారు.

మళ్లీ పెద్దపులి సంచారం?



పులి పాదముద్రలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని లవ్వాల బీట్ పరిధి బంధాల దేవునిగుట్ట అడవిలో శనివారం పెద్దపులి సంచరించింది. గత కొద్ది రోజుల క్రితం దామెరవాయి అడవిలోని వట్టివాగు, నర్సాపూర్, గొరారం వాగు బ్రిడ్జి కింద నుంచి పెద్దపులి సంచరించిన పాదముద్రలను అధికారులు గుర్తించారు. గురువారం భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కరకగూడెం అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను అక్కడి అధికారులు గుర్తించినట్లు తెలిసింది. అయితే శనివారం తాడ్వాయి మండలంలోని బంధాల దేవునిగుట్ట ప్రాంతంలో పెద్దపులి మళ్లీ తిరిగినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అటవీశాఖ అధికారులు మాత్రం పెద్దపులి పాదముద్రలను గుర్తించినట్లు ధ్రువీకరించడం లేదు. ఇదే విషయంపై సెక్షన్ ఆఫీసర్ సజన్‌లాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.



ఈ ఫొటోలోని ఉపాధ్యాయుడి పేరు యాదగిరి. గార్ల ప్రభుత్వ పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఇతను విద్యార్థులకు గణితంపై భయాన్ని పోగొట్టి.. సులభంగా నేర్చుకునే విధంగా గణితాన్ని బోధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా గణితంలో తాను చేసిన పరిశోధనా పత్రాన్ని హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్టీకి సమర్పించాడు. దాన్ని పరిశీలించిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి యాదగిరిని అభినందించారు. భవిష్యత్‌లో గణిత పరిశోధనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పరిశోధనలు చేయాలనుకుంటున్నట్లు యాదగిరి తెలిపారు.

– మహబూబాబాద్ అర్బన్



సరూపత్రిభుజ నియమాలను ఉపయోగించి ఎత్తును కనుగొనేందుకు గైడ్ టీచర్ చొల్లేటి పరమాత్మాచారి, ప్రధానోపాధ్యాయుడు బద్రీనారాయణ పర్యవేక్షణలో ప్రాజెక్ట్‌ను రూపొందించి జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శించాడు మాధవపురం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి మల్లెబోయిన ఉదయ్‌కిరణ్. ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్ట్‌లో ప్రధాన నియమాన్ని ఉపయోగించి ఎంతటి గరిష్ట ఎత్తునైనా ఒక దర్పణం, మెజరింగ్ టేప్ సాయంతో కనుగొనవచ్చని.. భౌతిక శాస్త్రం నుంచి పతన కోణం పరావర్తన కోణం సమానం అనే దృగ్విషయాన్ని చేర్చి భౌతిక, గణిత శాస్త్ర మేలవింపుతో కొనసాగించినట్లు వివరిస్తున్నాడు ఉదయ్‌కిరణ్.


– మహబూబాబాద్ అర్బన్



పెద్దవంగర మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చక్రగిరి ప్రభాకర్ ప్రయోగాల్లో దిట్ట. విద్యార్థులకు నిరంతరం గణితంలో టాలెంట్ టెస్టులు, క్విజ్ నిర్వహిస్తారు. సందేహాలను నివృత్తి చేస్తూ సులభంగా లెక్కల సూత్రాలను వివరిస్తున్నాడు. సీవీ రామన్ జయంతి సందర్భంగా ఇటీవల మహబూబాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయిలో గణిత పోటీలో తమ పాఠశాల విద్యార్థులు రాపోలు లుకేష్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. గతంలో జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక కాగా మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర నాని 'సకురా సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్' అనే కార్యక్రమంలో పాల్గొన్నాడు.

– పెద్దవంగర

గణితంలో ఘటికులు



గణిత దినోత్సవం ఎలా వచ్చిందంటే..

సంఖ్యాశాస్త్రంలో రామానుజన్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1962వ సంవత్సరంలో రామానుజన్ 75వ జన్మదినం రోజు స్మారక తపాలా బిళ్లను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్.. రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు.

గణితమంటే అంకెల గారడీ కాదు. సంఖ్యల మేళవింపు అంతకంటే కాదు. అదొక మహా సముద్రం. కిటుకు తెలిస్తే తక్షణమే విజయ తీరాల్ని చేరవచ్చు. అదే తరహాలో అంకిత భావం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే చిటికె వేసినంత సులువుగా లెక్కలు చేస్తున్నారు.

నేడు (ఆదివారం) రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం. ఈ నేపథ్యంలో గణితంలో ప్రతిభ కనబరుస్తున్న ఘనులపై, వారిని తయారు చేస్తున్న ఉపాధ్యాయులపై ఈ వారం 'సాక్షి' ప్రత్యేక కథనం.

– సాక్షి నెట్‌వర్క్

అంకెలతో ఆట.. సూత్రాలతో లెక్కల వేట

- విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ప్రాజెక్టులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శన.. గుర్తింపు
- నేడు జాతీయ గణిత దినోత్సవం (రామానుజన్ జయంతి)

సండే స్పెషల్



ఈ ఫొటోలోని విద్యార్థిని పేరు ఇందుర్తి సాయిలేఖ్య. కంబాలపల్లి గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని గణితంలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది. కంబాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ 2022 – 23 విద్యాసంవత్సరంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి గణిత టాలెంట్ పరీక్షకు హాజరై తృతీయ స్థానం సాధించింది. అదే ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10 జీపీఏ సాధించింది. మేధా ట్రస్ట్ టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికై రెండు సంవత్సరాలు ఉచిత విద్యనభ్యసిస్తుంది. ఇంటర్మీడియట్ (ఎంపీసీ)లో 468 మార్కులు సాధించింది. అదే విధంగా సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ వారి యంగ్ ఇండియా శాస్త్రవేత్త కార్యక్రమంలో పాల్గొంది. నాటి కలెక్టర్ శశాంకతో అభినందనలు అందుకుంది.

– మహబూబాబాద్ రూరల్



మహబూబాబాద్‌లోని ఏకశిల హోలిఏంజిల్స్ హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శన

'లెర్నింగ్ బై డూయింగ్'లో బోధన

- గణితం సులువుగా అర్థమవుతుంది..
- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండారి రమేశ్



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

విద్యారణ్యపురి: 'గణిత పాఠ్యాంశాల బోధన లెర్నింగ్ బై డూయింగ్ పద్ధతిలో సూత్రాలను నిరూపిస్తూ సమస్యల సాధనను వివరిస్తే విద్యార్థులు సులభరీతిలో అర్థం చేసుకోగలుగుతారు' అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గణితం రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్ బండారి రమేశ్ అన్నారు. నేడు (ఆదివారం) జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. సాధారణంగా గణితం అంటే విద్యార్థులు భయానికి లోనవుతారు. కానీ భయపడాల్సిన సబ్జెక్టు ఏమీ కాదు. నేను బ్లాక్ బోర్డుపై సూత్రాలు వేసి సమస్యలను సాధించినప్పుడు అతి కొద్దిమంది విద్యార్థులు మాత్రమే అర్థం చేసుకునేవారు. మిగతా వారు అడగలేక విషయాలను దాటవేసేవారు. పరీక్షల్లో తక్కువగా మార్కులు వచ్చేవి. దీనిని ఏ విధంగా అధిగమించాలనే ఆలోచన చేశా. ఆ.. ఆలోచన ఫలితమే లెర్నింగ్ బై డూయింగ్ పద్ధతి. ఈ పద్ధతిలో బోధన చేస్తే ఎలా ఉంటుందనేది అనుకున్నా. నేను ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సందర్భంలో ప్రయోగాత్మకంగా గణితం బోధించినప్పుడు విద్యార్థుల్లో ఆసక్తి పెరగడం గమనించా. పాఠ్యాంశాన్ని ప్రయోగాత్మకంగా విద్యార్థులతో చేయిస్తూ గణిత సమస్యలను సాధన చేయించాను. ఆ తరువాత పరీక్షల్లో 80శాతంమంది మంచి మార్కులు సాధించారు. అప్పటినుంచి లెర్నింగ్ బై డూయింగ్ పద్ధతిలోనే గణితం బోధిస్తూ వస్తున్నా. చిటూరు, వెంకటాపూర్‌కలాన్, ప్రస్తుతం వరంగల్ జిల్లా నెక్కొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా. జాతీయస్థాయిలో సైన్స్‌అండ్ టెక్నాలజీలో విజ్ఞాన ప్రదర్శనలకు విద్యార్థులను ప్రోత్సహించా. దానికి కొనసాగింపుగా ఉన్నత పాఠశాలలోని ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఉపయోగించి టెక్నాలజీ ద్వారా గణిత పాఠ్యాంశాలను చెబుతున్నా. ఈ ప్రయోగశాలకు 2018లోనే కేంద్ర ప్రభుత్వం గుర్తించి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి ఉపరాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నా. ప్రస్తుతం టెక్నాలజీని వినియోగించి గణిత పాఠ్యాంశాలను బోధించటం ద్వారా అమూర్తభావనలను విద్యార్థులు సలభతరంగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

'లెర్నింగ్ బై డూయింగ్ అనగా గణితంలో సూత్రాలు, కృత్యాలను నిర్వహిస్తూ ప్రయోగాత్మకంగా సూత్రాలను రాబట్టడం. (ఉదాహరణ త్రిభుజ వైశాల్యం = 1/2 X భూమి X ఎత్తు. విద్యార్థి పై సూత్రాన్ని ఉపయోగించేటప్పుడు 1/2 ఎలా వచ్చింది అని అడిగితే దానిని ప్రయోగాత్మకంగా వివరించి చెప్పడం.)'

సెమినార్‌లో రమేశ్ పేపర్ ప్రజెంటేషన్



రమేశ్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి

జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో శనివారం మ్యాథ్‌మెటిక్స్ సెమినార్ నిర్వహించారు. ఇందులో బండారి రమేశ్ గణితం సబ్జెక్టుపై తన పరిశోధన పత్రం సమర్పించారు. దీంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆయనకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న డీఈఓ రవీందర్‌రెడ్డి, తదితరులు

- డీఈఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి

దోర్నకల్: పోషకాలు, పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎదుగుదల సమయంలో సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇదిలా ఉండగా.. తల్లిదండ్రులు లేని, సింగిల్ పేరెంట్ కలిగిన పదిమంది విద్యార్థులకు డీఈఓ సైకిళ్లను పంపిణీ చేశారు. 1982 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆరు, పాఠశాల ఉపాధ్యాయురాలు మంజులత మూడు, గ్రేసమ్మ ఓ సైకిల్ కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు. మాథ్స్ డే సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన ఆకృతులను డీఈఓ తిలకించారు. హెచ్‌ఎం బండి నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎస్‌ఓ అప్పారావు, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్ సురేందర్‌జైన్, 1982 బ్యాచ్‌కు చెందిన బిక్కసాని రామకృష్ణ, రమేష్, సంపత్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, శ్రీనివాసరావు, మంజులత, గ్రేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలుగా నిలవాలి

- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి జ్యోతి
- ముగిసిన సీఎం కప్ క్రీడలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా ఖోఖో జట్టు

మహబూబాబాద్ అర్బన్: సీఎం కప్ క్రీడల్లో జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సైతం విజేతలుగా నిలువాలని జిల్లా క్రీడల యువజన శాఖ అధికారిణి జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. యువత, విద్యార్థులను క్రీడల్లో పోత్సహించేందుకు గ్రామీణ, మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ పేరుతో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మెరిసిన క్రీడాకారులు జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు, కోచ్‌లు, వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, పద్మావతి, పుష్పాలీల, శ్రీనివాస్, సునీత, వీరభద్రం, సింధువర్మ, శంకర్, నిర్మల, చాంప్లనాయక్, అరుణ, మాధవి, కాశీనాథ కుమారస్వామి, కమల్‌కిషోర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఐడీఓసీలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, వీర బ్రహ్మచారి, అధికారులతో క్రిస్మస్ వేడుకల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా క్రిస్మస్ కమిటీలు, అధికార యంత్రాంగం సమన్వయంతో కలిసి వేడుకలు నిర్వహించాలని తెలిపారు. చర్చీలను విద్యుద్దీపాలతో అలంకరించాలని, చర్చీల ప్రాంగణాల్లో శానిటేషన్ నిర్వహించి తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రత్యేక ప్రార్థనలు, కార్యక్రమాల అనంతరం విందు ఏర్పాటు చేయాలని, చర్చీల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గణేశ్, కృష్ణవేణి, జిల్లా మైనార్టీ అధికారి శ్రీనివాస్, డీపీఓ హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, డీవీహెచ్‌ఓ మరియన్న, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్, మున్సిపల్ కమీషనర్లు రవీందర్, నరేశ్‌రెడ్డి, తహసీల్దార్ భగవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతపరచాలి

జిల్లా వ్యాప్తంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తృతపరచాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలకు నష్టపోయిన బాధితుల గ్రామాలను సందర్శించి దుప్పట్లు, వంట సామగ్రి, దుస్తులు, ఆదివాసులకు దోమ తెరలు, టీబీ వ్యాధుగ్రస్తులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. గంగారం మండలంలోని 15 నుంచి 20 సంవత్సరాల చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో సరిపడా రక్త నిల్వలు లేవని, యువజన సంఘాల, స్వచ్ఛంద సంస్థలతో సమావేశాలు నిర్వహించి శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ నెహ్రూ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, సభ్యులు వెంకన్న, విశ్వేశరరావు, డాక్టర్ సూర్య కుమారి, న్యాయ సలహాదారులు కొండపల్లి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన విదేశీయులు



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని శనివారం బెల్జియంకు చెందిన డాక్టర్ స్టీఫెన్, స్కార్లెట్ దంపతులు సందర్శించారు. రామలింగేశ్వరుడిని వారు దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్‌కుమార్ వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ వారు కొనియాడారు. అనంతరం సరస్సు కట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతులు సుభిక్షం

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అభిప్రాయపడ్డారు. మండలంలోని పోచంపల్లి గ్రామంలో దేవాదుల భూనిర్వాసితులకు నిధులు మంజూరు కాగా శనివారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 250మంది రైతులు దేవాదుల ప్రాజెక్టు ద్వారా భూ నిర్వాసితులు కాగా ప్యాకేజీ ఆరు ద్వారా వారికి రూ.11.40 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మండలంలోని అవుతాపురం, పోచంపల్లి, గంట్లకుంట చెరువులను గోదావరి జలాలతో నింపుతామని తెలిపారు. మండలంలోని భూ నిర్వాసితులైన 110మంది రైతులకు రూ.4.13లక్షలు అందాయని ఇరిగేషన్ ఈఈ సీతారాం నాయక్ తెలిపారు. నిధుల పంపిణీలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏఎంసీ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, ఆర్డీఓ గణేష్, ఇరిగేషన్ ఈఈ సీతారాం నాయక్, డీఈ కిషన్ ప్రసాద్, ఏఈ కిశోర్, నాయకులు హమ్యా నాయక్, ముద్దసాని సురేష్, విజయ్‌పాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్‌లో..


సాయంత్రం 5:20 గంటలకు


5:25..


6:00 గంటలకు..

వరంగల్ నగరంలో..


సాయంత్రం 5:07 గంటలకు


5:20..

'శీతాకాలపు అయనాంతం'

శనివారం దాదాపు 13 గంటల పాటు రాత్రి సమయం..మిగిలిన 11 గంటలు పగలు సమయం ఏర్పడింది. సాధారణంగా ఇలా ఏర్పడడాన్ని అయనాంతం అని పిలుస్తారు. అయనాంతం ఏర్పడిన రోజున భూమి ఉత్తరార్థగోళం సూర్యుడి నుంచి ఎక్కువ దూరం వెళ్తుంది. అదే సమయంలో చంద్రుడి కాంతి భూమిపై చాలా సమయం ఉంటుంది. అంటే సూర్యకాంతి ఉండే సమయం తక్కువ. ఇది శీతాకాలంలో ఏర్పడుతున్నందున దీనిని 'శీతాకాలపు అయనాంతం' అని అంటారు. మహబూబాబాద్, వరంగల్ నగరంలో సూర్యాస్తమయంలో కనిపించిన దృశ్యాలు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్ / మహబూబాబాద్

ఉమ్మడి వరంగల్ సమగ్రాభివృద్ధికి పాటుపడాలి

- వరంగల్‌ను రెండో రాజధాని చేయాలి
- చర్చా వేదికలో మేధావులు


మాట్లాడుతున్న పుల్లూరు సుధాకర్

హన్మకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు పాటుపడాలని పలువురు మేధావులు పిలుపునిచ్చారు. శనివారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ మహానగర అభివృద్ధికి ఉన్న అవకాశాలు, వనరులు, ఇతర అంశాలపై గణాంకాలతో సహా వివరించడంతో పాటు విజన్ డాక్యుమెంట్ విడుదల చేశారు. హైదరాబాద్‌కు ధీటుగా వరంగల్ అభివృద్ధికి అన్ని అనుకూలతలు ఉన్నాయన్నారు. నగరాన్ని జీవనయోగ్యంగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఉపాధి కల్పన కేంద్రంగా, ఆర్థిక చోదక శక్తిగా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ గత పదేళ్లలో వరంగల్ నగరం చాలా వెనుకబడిందన్నారు. పూర్వ వరంగల్ విభజనతో జిల్లా తన రాజకీయ చారిత్రక అస్తిత్వాన్ని కోల్పోయిందని, వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు ముద్దసాని సహోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ సదానందం, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వరరావు మాట్లాడారు. వరంగల్ నగరాన్ని రాష్ట్ర రెండో రాజధానిగా చేయాలని, నగర మాస్టర్ ప్లాన్‌పై పౌరులకు అవగాహన కల్పించాలని, భూగర్భ డ్రెయినేజీ నిర్మించాలని, మామునూరు ఎయిర్‌పోర్టు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు దాసరి కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ విజయబాబు, రామిరెడ్డి, సారంగపాణి, వి.బాబురావు, పురుషోత్తం, సోమ రామ్మూర్తి, మండల పరుశరాములు, కవి సిరాజ్, చంద్రశేఖర్, రాజు యాదవ్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కలగానే కన్వర్షన్.!

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న విద్యుత్ చిరుద్యోగులు
- కాలయాపన చేస్తున్న ఎన్పీడీసీఎల్ అధికారులు
- ఖాళీ పోస్టులతో కార్యాలయంలో సిబ్బంది కొరత

ఉమ్మడి వరంగల్‌లో ఖాళీగా 19 రికార్డు అసిస్టెంట్ పోస్టులు



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ : కిందిస్థాయి విద్యుత్ ఉద్యోగులపై టీజీఎన్పీడీసీఎల్ సవతి తల్లి ప్రేమ చూపుతోంది. అన్ని స్థాయిలో పదోన్నతులు కల్పించిన ఆ శాఖ యాజమాన్యం కిందిస్థాయి ఉద్యోగులను విస్మరించింది. వాచ్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్లు, స్వీపర్ల కన్వర్షన్‌ను పట్టించుకోవడం లేదు. అర్హులైన వాచ్‌మెన్లు, ఆఫీస్ సబార్డినేట్లు, స్వీపర్లు.. రికార్డు అసిస్టెంట్‌గా వెళ్లేందుకు దరఖాస్తులు చేసుకుని రోజులు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చొరవ తీసుకోవడం లేదని వారు మదన పడుతున్నారు. జిల్లాల పునర్విభజనతో పూర్వ వరంగల్ (విద్యుత్ సర్కిల్) ఆరు రెవెన్యూ జిల్లాలుగా, ఐదు విద్యుత్ (టీజీ ఎన్పీడీసీఎల్) సర్కిళ్లుగా ఏర్పడ్డాయి. ములుగు, భూపాలపల్లి జిల్లాలు భూపాలపల్లి సర్కిల్, జనగామ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సర్కిళ్లు ఏర్పాటు చేసి రికార్డు అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేశారు.ఈ పోస్టులను భర్తీ చేయక పోవడంతో ఏడేళ్లుగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అయితే నియామకమైన నాటి నుంచి ఐదేళ్లు పూర్తి చేసుకుని, కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులైన వాచ్‌మెన్‌లు, ఆఫీస్ సబార్డినేట్‌లు, స్వీపర్లు రికార్డు అసిస్టెంట్ పోస్టుకు అర్హులు. విద్యుత్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తు మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులకు కారుణ్య నియామకాల కింద వాచ్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్‌లుగా, స్వీపర్లుగా నియమించారు. కుటుంబంలో ఉన్నత విద్య అభ్యసించి ఉన్నా ఆ స్థాయి ఉద్యోగాలు అందుబాటులో లేక పోవడంతో కుటుంబం గడవడానికి చిరుద్యోగంలో చేరారు. 19 రికార్డు అసిస్టెంట్ పోస్టులుండగా 23 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా పునర్విభజనలో అన్ని స్థాయిలో ఉద్యోగుల విభజన జరిగినా వాచ్‌మెన్, స్వీపర్, లైన్‌మెన్ కమ్ డ్రైవర్ల విభజన జరగలేదు. వీరు హనుమకొండ, వరంగల్ సర్కిల్ పరిధిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా టీజీ ఎన్పీడీసీఎల్ యజమాన్యం, అధికారులు కన్వర్షన్‌పై దృష్టి సారించి త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు కోరుతున్నారు.

23 మంది దరఖాస్తు..

కన్వర్షన్ కోసం హనుమకొండ సర్కిల్‌లో 12 మంది, వరంగల్ సర్కిల్‌లో 11 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా హనుమకొండ సర్కిల్ పరిధిలో 5 రికార్డు అసిస్టెంట్ పోస్టులు, వరంగల్ సర్కిల్ పరిధిలో 4, జనగామ సర్కిల్‌లో 3, మహబూబాబాద్ సర్కిల్‌లో 4, భూపాలపల్లి సర్కిల్‌లో 3 రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆఫీస్ సబార్డినేట్‌లు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లకు కన్వర్షన్ కల్పిస్తూ రికార్డు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా అధికారులు నాన్చివేత ధోరణి అవలంభిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రపతిని కలిసిన మౌంటైనర్ యశ్వంత్


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భూక్య యశ్వంత్

మరిపెడ రూరల్ : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్య తండాకు చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ హైదరాబాద్‌లోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా యశ్వంత్ ఓ చిత్రపటాన్ని రాష్ట్రపతి ముర్ముకు అందజేశాడు. పర్వతారోహణ చేసిన పలు విషయాలను రాష్ట్రపతికి వివరించాడు. మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించి దేశం, ప్రపంచం గర్వపడేలా ముందుకు సాగాలని రాష్ట్రపతి అభినందించినట్లు మౌంటైనర్ యశ్వంత్ తెలిపాడు.

రేపు పీవీ వర్ధంతి సంస్మరణ సభ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో ఈనెల 23న (సోమవారం) భారత రత్న, దివంగత నేత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీవీ మదన్‌మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పీవీ కుమార్తె సురభి వాణిదేవి, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభిమానులు, నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రియురాలి మృతిని తట్టుకోలేక ప్రియుడి ఆత్మహత్య


బానోత్ వంశీ (ఫైల్)

గార్ల : ప్రేమించిన యువతి ఆత్మహత్య చేసుకున్న వారం రోజుల్లోనే ప్రియుడు సైతం జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం పినిరెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బానోత్ వంశీ (22), మహబూబాబాద్ మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కాగా యువతి కుటుంబ సభ్యులు వీరి ప్రేమను నిరాకరించడంతో వారం రోజుల క్రితం ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కాగా తాను ప్రేమించిన యువతి మరణాన్ని తట్టుకోలేక బానోత్ వంశీ సైతం ఈనెల 19వ తేదీన స్థానిక పల్లెప్రకృతి వనంలో పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా స్థానికులు గమనించారు. ఏమైందని అతడిని ప్రశ్నించగా తాను ప్రేమించిన యువతి మృతిచెందడంతో, నేను కూడా చనిపోవాలని నిర్ణయించుకొని పురుగుల మందు తాగానని చెప్పాడు. స్థానికులు వంశీని 108 ద్వారా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తల్లి భద్రమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు -
బ్రాయిలర్ లైవ్ రేటు -
స్కిన్‌లెస్ లైవ్ రేటు -
Cell: 9989299661

శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థానము
గ్రా॥ & మం॥ ఐనవోలు, హనుమకొండ జిల్లా
లేఖ నెం. SMSD/109/2024 తేది: 16-12-2024
సీల్డు టెండర్ కం. బహిరంగ వేలము ప్రకటన-6
దేవాదాయ ధర్మాదాయ శాఖ, హనుమకొండ జిల్లా, గ్రా & మం॥ ఐనవోలు నందు వేంచేసియున్న శ్రీ మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానము నందు 2025 సం॥రము కొబ్బరి కాయలు అమ్ముకొను హక్కు లైసెన్స్ సీల్డు టెండర్ కం. బహిరంగ వేలములు తేది. 23-12-2024 రోజున నిర్వహించుటకు నిర్ణయించనైనది. ఆసక్తికలవారు పూర్తి వివరముల కొరకు ఫోన్ నెం.
9949922547, 9652516722
సంప్రదించగలరు. సం॥ కార్యనిర్వహణాధికారి

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

కాటారం : మండలంలోని అంకుషాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీసులు 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ, ఎస్సై వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన కాల్వ శైలజ (30) కొంత కాలంగా భర్తకు దూరమై తల్లి వద్దే ఉంటుంది. తన అక్క, చెల్లి అత్త గారి గ్రామమైన కాటారం మండలం అంకుషాపూర్‌కు తరుచూ వస్తుంటుంది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన ఇనుగాల రమేశ్‌తో పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారి తీసింది. కొన్ని రోజులకు పలు కారణాలతో శైలజ, రమేశ్‌ను దూరం పెట్టడంతో పాటు తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని ఇబ్బందిపెట్టింది. ఈ విషయంపై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసింది. దీంతో శైలజను ఎలాగైన వదిలించుకోవాలనే ఉద్దేశంతో రమేశ్ ప్లాన్ ప్రకారం డబ్బులు ఇస్తానని నమ్మబలికి ఈ నెల 17న అంకుషాపూర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకు వెళ్లాడు. నిర్మానుష ప్రాంతం కావడంతో శైలజను గొంతు నులిమి హత్య చేసి అక్కడే ఓ కందకంలో పడేసి పారిపోయాడు. హత్య సమాచారం అందుకున్న పోలీసులు ఈ నెల 20న సంఘటన స్థలానికి వెళ్లి కుటుంబ సభ్యుల ద్వారా శైలజ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి తల్లి దుర్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసులు గాలిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రమేశ్ శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు. కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

అన్న కాదు.. తమ్ముడి వద్దే 'బంగారం'

- పోలీసులకు చిక్కిన కీలక నిందితుడు మహమ్మద్ నవాబ్ హసన్
- 10 కిలోలకుపైగా గోల్డ్ తమ్ముడు సాజిద్ ఖాన్ వద్ద ఉందని వెల్లడి
- మరో ఇద్దరి వద్ద ఉన్న ఆరు కిలోల బంగారం కోసం గాలింపు
- రాయపర్తి ఎస్‌బీఐలో చోరీ జరిగి నెల రోజులైనా పెద్దగా లేని రికవరీ

సాక్షి, వరంగల్ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఎస్‌బీఐలో 19 కిలోల బంగారం చోరీ కేసులో రికవరీ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. ఈ ఘటన జరిగి నెల రోజులు దాటుతున్నా చివరకు ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ నవాబ్ హసన్‌ను రెండ్రోజుల క్రితం పోలీసులు పట్టుకుని రిమాండ్ తరలించారు. అతడి వద్ద ఇసుమంత బంగారం కూడా దొరకలేదు. గ్యాస్ కట్టర్ వృత్తిలో నైపుణ్యమున్న తన తమ్ముడు సాజిద్ ఖాన్ వద్ద 10 కిలోల 480 గ్రాముల బంగారం ఉందని, తనవద్ద ఏమీ లేదని మహమ్మద్ నవాబ్ హసన్ విచారణలో పోలీసులకు చెప్పాడు. దీంతో అతడి కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. యూపీలోని బదౌన్ జిల్లా కక్రాలా గ్రామంలోకి ప్రాణాలకు తెగించి లోపలికి వెళ్లిన వరంగల్ పోలీసులకు మహమ్మద్ నవాబ్ హసన్ మాత్రమే దొరకడం, అతడి తమ్ముడు సాజిద్ ఖాన్ జాడ లేకపోవడంతో బంగారం రికవరీ పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటికే అర్షాద్ అన్సారీ, షాకీర్ ఖాన్ అలియాస్ బొలేఖాన్, హిమాన్షు బికాం చండ్ జాన్వర్‌ను డిసెంబర్ 6న పోలీసులు అరెస్టు చేసి, రెండు కిలోల 520 గ్రాముల బంగారం మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన 16 కిలోల 480 గ్రాముల బంగారంలో ఆరు కిలోలు మహారాష్ట్రకు చెందిన సాగర్ భాస్కర్‌గోర్, అక్షయ్ గజానన్ అంబోర్ వద్ద ఉందని, సాజిద్ ఖాన్ వద్ద 10 కిలోల 480 గ్రాముల బంగారం ఉందని నిందితులు చెప్పడంతో పోలీసులకు వారిని పట్టుకునేందుకు శ్రమిస్తున్నారు.

నేపాల్‌లో సాజిద్ ఖాన్..!

సాజిద్ ఖాన్ ఆచూకీ లభించకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులను పోలీసులు విచారించారు. ఎక్కడున్నాడు.. ఎక్కడికెళ్లాడని ఆరా తీసినా వారి నుంచి పెద్దగా సమాధానం రాలేదు. సాజిద్ ఖాన్‌తో తమకు సంబంధం లేదని, మీరు ఏమైనా చేసుకోండి అని చెప్పడంతో పోలీసులు అక్కడి నుంచి వచ్చేశారు. సాజిద్ ఖాన్ ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండడం, అంత బంగారంతో ఎక్కడున్నాడు అని పోలీసులు గాలిస్తున్నారు. నేపాల్‌కు వెళ్లి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే, మహారాష్ట్రలోని అంబోర్ గ్రామానికి చెందిన మరో ఇద్దరు నిందితులు సాగర్ భాస్కర్ గోర్, అక్షయ్ గజానన్ అంబోర్ ఇళ్ల వద్దకు వెళ్లినా వారి కుటుంబ సభ్యుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో వెనుదిరిగి వచ్చారు. పోలీసులు ఈ ముగ్గురిని పట్టుకునేందుకు ఢిల్లీ, యూపీ, మహారాష్ట్రలోనే నిఘా వేసి ఉంచారు. నవంబర్ 18 అర్ధరాత్రి తర్వాత జరిగిన ఈ భారీ చోరీ ఘటనలో బంగారం రికవరీ కాకపోవడంతో పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. ఈ నెలాఖరు వరకైనా ఆ ముగ్గురిని పట్టుకొని బంగారం రికవరీ చేయగలిగితే వరంగల్ పోలీసులు పనితీరు మెరుగ్గా ఉండనుంది.

భార్యపై అనుమానంతో బిహార్ కూలీ హత్య

- ముగ్గురి అరెస్ట్..ఐరన్ రాడ్, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరామ్‌నాయక్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

ఖిలా వరంగల్ : భార్యపై అనుమానంతో బిహార్ కూలీని హత్య చేసి పరారైన భర్త అతని బామ్మర్దులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. బిహార్ రాష్ట్రం ఖగారియ జిల్లా బయమందెపూర్ మండలం జంగరా గ్రామానికి చెందిన ముని దూలర్ చంద్రకుమార్ బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం వరంగల్ కరీమాబాద్‌లోని ఎస్ఆర్ఆర్‌తోటకు వచ్చి తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగకు చెందిన బానోత్ నగేష్ అతని భార్యతో కలిసి కరీమాబాద్‌లో అద్దెకు ఉంటూ తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. వరంగల్ చిన్న బ్రిడ్జి ఉప్పరి అడ్డా వద్ద చంద్రకుమార్‌కు నగేష్ పరిచయమయ్యాడు. మూడు నెలల క్రితం చంద్రకుమార్ తమ్ముడు దిల్ ఖుష్‌కుమార్ (16) పనికోసం బిహార్ నుంచి వరంగల్‌కు రాగా అన్నతమ్ములిద్దరూ తాపీమేస్త్రీ పనికి వెళ్తున్నారు. నెల క్రితం ఎస్ఆర్ఆర్‌తోటలోని పుట్నాల మిల్లు సమీపాన రేకుల గది అద్దెకు తీసుకుని అన్నదమ్ములు, వారి స్నేహితుడు పవన్ కలిసి ఉంటున్నారు. వీరు ఉండే ఇంటి ఎదుట నగేష్ అత్తింటివారు కూడా అద్దెకు ఉంటున్నారు. నగేష్ భార్య శిరీష అతని తల్లి గారింటికి వచ్చిన సమయంలో చంద్రకుమార్, అతని తమ్ముడు దిల్ ఖుష్‌కుమార్ ఆమె పట్ల అసభ్యకరంగా మాట్లాడడాన్ని జీర్ణించుకోలేక పోయారు. దీంతో కొద్ది రోజుల క్రితం నగేష్, అతని బామ్మర్దులు అజ్మీరా అశోక్, తేజావత్ శ్రీనివాస్ అలియాస్ (బన్నీ) కలిసి అన్నదమ్ములిద్దరినీ పిలిపించి మాట్లాడుతుండగా ఇరువురి మధ్య గొడవ జరిగింది. అదే సమయంలో చంద్రకుమార్, దిల్‌ఖుష్‌కుమార్, నగేష్ భార్య శిరీషతో అసభ్యకరంగా మాట్లాడారు. అప్పటి నుంచి నగేష్ అన్నదమ్ములిద్దరిని ఎలాగైన చంపాలని వారిపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 17న రాత్రి చిన్న బ్రిడ్జి వద్ద ఉన్న బార్‌లో చంద్రకుమార్ ఉన్న విషయం తెలుసుకుని అతన్ని ఎలాగైనా హత్య చేయాలని నగేష్ తన బామ్మర్దులు అశోక్, శ్రీనివాస్‌ను వెంట తీసుకుని వెళ్లాడు. వీరు ముగ్గురు కలిసి చంద్రకుమార్‌ను చంపడానికి ప్రయత్నం చేయగా అతను తప్పించుకుని పారిపోయాడు. అనంతరం వారు ఉంటున్న అద్దెకు ఇంటికి వెళ్లే సరికి ఒంటరిగా ఉన్న దిల్‌ఖుష్‌కుమార్ పై దాడి చేసి తలపై ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేసి పారిపోయారు. మృతుడి అన్న చంద్రకుమార్ ఫిర్యాదు మేరకు నగేష్, అశోక్, శ్రీనివాస్‌లపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఐరన్ రాడ్, బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ నందిరామ్‌నాయక్ తెలిపారు. హత్య కేసును 48 గంటల్లో ఛేదించిన ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సై శ్రీకాంత్, క్రైం కానిస్టేబుళ్లకు ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

విద్యుత్ ఉచ్చు తగిలి యువకుడి మృతి


గణేశ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల : అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు (ఉచ్చు) అమర్చిన వ్యక్తి.. ప్రమాదవశాత్తు అదే వైర్లకు తగలడంతో షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన వెంచరామిలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. టేకుమట్ల మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన లోకిని గణేశ్(28) అడవి పందుల కోసం చిట్యాల మండలంలోని వెంచరామి గ్రామ శివారులో విద్యుత్ వైర్లు (ఉచ్చు) అమర్చాడు. అదే వైర్లకు గణేశ్ తగిలి మృతి చెందినట్లు వారు తెలిపారు. కాగా సంఘటన స్థలానికి సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్ కుమార్ వెళ్లి పరిశీలించారు. మృతిడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతిడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోలీస్ కస్టడీకి రాజన్న కోడెల నిందితులు..

గీసుకొండ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి కోడెలను రైతుల పేరిట తీసుకొచ్చి కబేళాలకు అమ్ముకున్న ముగ్గురు నిందితులను గీసుకొండ పోలీసులు మూడ్రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. ఈ కేసులో నిందితులను మరింత విచారించాల్సి ఉందని కోర్టును కోరగా శనివారం అనుమతించినట్లు తెలుస్తోంది. గీసుకొండ మండలం మనుగొండకు చెందిన మాదాసి రాంబాబు, అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, పసునూటి శ్యాంసుందర్ (గతంలో దుగ్గొండి మండలం చలపర్తి)కి చెందిన వారు ప్రధాన నిందితులు. కాగా, ఈ నెల 10న వారిని గీసుకొండ పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారు. ఈ నెల 23 వరకు పోలీసులు విచారించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కోడెల అమ్మకం వ్యవహారంలో నిందితులు పోలీసు విచారణలో ఏం విషయాలు చెబుతారో, ఆరోపణలు ఎదుర్కొంటున్న వేములవాడ రాజన్న ఆలయ అధికారులు, సిబ్బంది, గోశాల నిర్వాహకుల్లో ఎవరికి ప్రమేయం ఉందో వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆల్‌ఇండియా వర్సిటీ స్విమ్మింగ్ పోటీలకు కేయూ జట్టు



కేయూ క్యాంపస్ : తమిళనాడులో 23వతేదీ వరకు జరగబోయే ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంటుకు స్విమ్మింగ్ పురుషుల, మహిళల టీం పాల్గొనబోతుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. వీరిలో కె.అక్షిత్ కేయూ ఇంజనీరింగ్ కళాశాల(కోఎడ్యూకేషన్), కె.వర్షిణిప్రియ (హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజి) ఉన్నారు. వీరికి యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల వ్యాయామ అధ్యాపకుడు భాస్కర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

- **Thorrur Main road Opp: Govt.** High School to let for 1st floor (for companies) minimum 5yrs agreement. Cell: 9059294384, 7306414384 [W-1237377]
- హన్మకొండ బాలసముద్రంలో 1 BHK Well Furnished House for Rent నియర్ సెంట్రల్ లైబ్రరీ, హన్మకొండ. 9448286104 [W-1264111]
- **S.V.N. Road లో కాకతీయ టాకీస్** ప్రక్కన Indian Bank పైన 1st floor 850" Hall ఆఫీసులకు, షాపింగ్‌లకు, చిట్‌ఫండ్‌కు కిరాయికివ్వబడును. సంప్ర॥ 9700721220 [W-1264060]

SHUTTERS FOR SALE

- హుజురాబాద్ రోడ్ పరకాల, పోచమ్మ గుడి ఎదురుగా ఉండబడే 200 గజాలు గల 2 షటర్స్ అమ్మబడును. సెల్: 9912791897, 9010065286. [W-1264155]

SERVICES

OLD AGE HOME

- హన్మకొండ, వడ్డెపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సంప్రదించగలరు: 9848444020, 9110551507. [W-1264108]

IGLOO ICE CREAM

- **IGLOO ఐస్‌క్రీమ్ అదాలత్ హన్మకొండ.** వివాహ శుభ కార్యములకు హోల్‌సేల్ రేటులో సప్లయి చేయబడును. వెనిల 220/-, బటర్ స్కాచ్ 300/-, సెల్ నెం: 9849165892, 9849375236. [W-1264109]

FINANCIAL SERVICES

- సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264050]

BUSINESS OFFER

- గార్మెంట్ & ఫుట్‌వేర్ ప్రొడక్ట్స్ కొరకు డిస్ట్రిబ్యూటర్లు కావలెను. ఆసక్తి, ఆర్థికస్థోమత కలిగినవారు సంప్రదించగలరు. వాట్సాప్: Ph: 9492251262 [HA-8203]
- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

- **Wanted Marketing executive Prefered** Qualification: 1) Education Bachelor's Degree Preferred. 2) Fluent in English, Telugu and Hindi, 3) Ability to travel as required. Please send your resume to mail info@primetextiles.in Or what's app: 9392902241. Last Date is 30-12-2024 to apply, interview follows for impressive profiles. [WA-2337]
- **Wanted Computer Operator.** Part / Full Time (Male / Female). Opp: SBI Bank, Under Bridge Road, Perukawada, Warangal. Cont: 7981380146. [W-1264158]
- **Universal** కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256014]
- శ్రీనివాస గ్రూపు, (నాగోల్, హైదరాబాద్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు 10th ఆపైన చదివిన 20-30 సం. వయస్సు గల M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 99636 91122, 92814 65315 [B-1172528]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 15-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1172526]
- త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000888]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-18000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177 [B-1172531]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.